# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | బుధవారం 14-9-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :29 | సంచిక: 37 | పేజీలు:6 | వెల: రూ.1/-


## సికింద్రాబాద్ ప్రమాదంపై మంత్రి కేటీఆర్ దిగ్భ్రాంతి

హైదరాబాద్, సెప్టెంబర్ 13: ఓతినితిబబివతీ ఖఖీ। సికింద్రాబాద్ ప్రమాదంపై మంత్రి కేటీఆర్‌గ్భ్రాంతి సికింద్రాబాద్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై రాష్ట్ర మంత్రి కేటీఆర్‌గ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.3 లక్షల నష్టపరిహారం అందజేయనున్నట్లు ఆయన ప్రకటించారు. ఇక్కడి రూబీ లాడ్జి సెల్లార్‌లో ఎలక్ట్రిక్ షోరూంలో పేలుడు కారణంగా మంటలు అంటుకున్న సంగతి తెలిసిందే.

ఆ సమయంలో లాడ్జిలో మొత్తం 25 మంది ఉన్నారు. వారిలో ఇప్పటికే 8 మంది మృత్యువాత పడ్డారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇంతకుముందే ఈ ప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ కూడా విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల నష్టపరిహారం ప్రకటించారు.

## 15 నుంచి గ్రేటర్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ సభ్యత్వ నమోదు

హైదరాబాద్, సెప్టెంబర్ 13: హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సభ్యత్వ నమోదు ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య, కార్యదర్శి బొల్లం శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల జరిగిన సొసైటీ సర్వసభ్య సమావేశం నిర్ణయం మేరకు ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈనెల 30వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. సొసైటీ సభ్యత్వానికి సంబంధించిన దరఖాస్తు ఫారం 15వ తేదీ నుంచి చిక్కడపల్లిలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం సమీపంలోని సొసైటీ కార్యాలయంలో అందజేస్తామన్నారు. 'ది గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్టు మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్' పేరుతో రూ.1050 ఏదేని బ్యాంకులో డిమాండ్ డ్రాఫ్ట్ తీసి దరఖాస్తుతో పాటు సొసైటీకి సమర్పించాలని కోరారు. 9100933723, 9393358519 నెంబర్లకు ఫోన్ చేయవచ్చు.

## షర్మిలపై స్పీకర్‌కు ఎమ్మెల్యేల ఫిర్యాదు..

హైదరాబాద్, సెప్టెంబర్ 13: వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలపై అసెంబ్లీ స్పీకర్‌కు ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో పాదయాత్ర చేస్తున్న సందర్భంలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారంటూ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, దాస్యం వినయ భాస్కర్, లక్ష్మారెడ్డి, కాలే యాదయ్య ఫిర్యాదు ప్రతిని అందించారు. చట్టసభల ప్రతినిధులు అనే స్పృహలేకుండా, ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేసేవిధంగా షర్మిల అవమానిస్తుందన్నారు.

ప్రజలెన్నుకున్న ప్రజాప్రతినిధుల హక్కులకు, గౌరవానికి భంగం కలిగించినందుకు, నిరాధార ఆరోపణలు, జుగుప్సాకర ఆరోపణలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరారు. షర్మిలపై ఇప్పటికే డీజీపీకి ఫిర్యాదు చేసినట్లు మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తామని స్పీకర్ పోచారం పేర్కొన్నారు. ఈ మేరకు ప్రివిలేజ్ కమిటీకి సిఫారసు చేస్తానని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. అయితే, సభాహక్కుల ఉల్లంఘన కమిటీ సమావేశం అయ్యే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తున్నది.

## అసెంబ్లీ నుంచి ఈటల రాజేందర్ సస్పెన్షన్



హైదరాబాద్, సెప్టెంబర్ 13: బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌పై తెలంగాణ అసెంబ్లీలో సస్పెన్షన్ విధించారు. సమావేశాలు ముగిసే వరకు ఆయనపై సస్పెన్షన్ విధించారు. అసెంబ్లీ సబ్ రూల్ 2, రూల్ 340 కింద బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను సస్పెండ్ చేస్తూ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తీర్మానం ప్రవేశపెట్టారు. సమావేశాలు ముగిసే వరకు రాజేందర్‌ను సస్పెండ్ చేశారు. సారీ చెప్పేందుకు ఈటల నిరాకరించారని, అందుకే ఆయన్ను సస్పెండ్ చేస్తున్నట్లు మంత్రి వేముల తెలిపారు. స్పీకర్ పోచారంను మరమనిషి అని రాజేందర్ చేసిన వ్యాఖ్యలు చాలా బాధాకరమని మంత్రి అన్నారు.

## హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ప్రభాకర్



హైదరాబాద్, సెప్టెంబర్ 13: తెలంగాణ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. చింతా ప్రభాకర్ రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనుండగా, ఆయనకు అవసరమైన కార్యాలయ వసతి, సిబ్బంది, జీతభత్యాలు తదితరాలను పరిశ్రమల శాఖ సమకూరుస్తుంది. 2014లో టీఆర్ఎస్ నుంచి సంగారెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికైన చింతా ప్రభాకర్ 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డిపై స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ప్రస్తుతం ఆయన సంగారెడ్డి జిల్లా టీఆర్ఎస్ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు.

### చరిత్రలో నేటినిజం



కం॥ తెరపైన నిలచి 'షోలే'
కెరదీపికయుగము దర్శకాళికి వెలుగునే
ధరతర మిటు చూపించగ
చిరకీర్తిని బొందినాడు 'జీ.పీ. సిప్పీ'!!

(సెప్టెంబర్ 14 షోలే జీ.పీ.సిప్పి పుట్టినరోజు...)



–రాధశ్రీ
సెల్:9494481210

# ఎనిమిది బిల్లులకు శాసన సభ ఆమోదం

హైదరాబాద్, సెప్టెంబర్ 13: తెలంగాణ ప్రభుత్వం ఇవాళ శాసన సభలో ఎనిమిది బిల్లులను సభలో ప్రవేశపెట్టగా.. సభ ఆమోదం తెలిపింది. మోటార్ వెహికల్ పన్నుల చట్ట సవరణ బిల్లు, విశ్వవిద్యాలయాల ఉమ్మడి నియామక బోర్డు బిల్లు, ప్రైవేట్ విశ్వవిద్యాలయాల చట్ట సవరణ బిల్లు, జీహెచ్ఎంసీ, పురపాలక చట్ట సవరణ బిల్లు, జీఎస్టీ చట్ట సవరణ బిల్లు, ప్రైవేట్ విశ్వవిద్యాలయాల చట్ట సవరణ బిల్లు, అజమాబాద్ పారిశ్రామిక చట్ట సవరణ బిల్లు, తెలంగాణ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ సూపరెన్యూయేషన్ సవరణ బిల్లులను మంత్రులు సభలో ప్రవేశపెట్టగా.. శాసన సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ప్రైవేట్ విశ్వవిద్యాలయాల చట్ట సవరణకు శాసనసభ ఆమోదం తెలుపగా.. కావేరి, గురునానక్, శ్రీనిధి, ఎంఎన్ఆర్, నిక్‌మార్ వర్సిటీలకు అనుమతి లభించినట్లయ్యింది.

కొత్త ప్రైవేట్ వర్సిటీల్లో తెలంగాణ విద్యార్థులకు 25 శాతం రిజర్వేషన్లు అమలు చేయనున్నారు. విశ్వవిద్యాలయాల ఉమ్మడి నియామక బోర్డు బిల్లుకు శాసనసభ ఆమోదం తెలుపగా.. 12 వర్సిటీలకు ఉమ్మడి నియామక బోర్డు ఏర్పాటు చాలా మంచి నిర్ణయమని మంత్రి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. నియామకాల తర్వాత కూడా కోర్టు కేసులు వస్తున్నాయని, కోర్టు తీర్పుల వల్ల కొన్ని వర్సిటీల్లో ఉద్యోగులను తొలగించాల్సి వచ్చిందన్నారు. యూజీసీ నిబంధనల మేరకే ఉమ్మడి నియామకను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉమ్మడి నియామక బోర్డు ఛైర్మన్‌గా.. ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఉంటారని, వీసీలే కమిటీ ఛైర్మన్లుగా ఉంటారన్నారు.

వర్సిటీల్లో 3వేలకుపైగా పోస్టులు భర్తీ చేసుకున్నామని, ఇక్కడి వర్సిటీల్లో దేశంలో ఎక్కడా లేని పే స్కేల్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. మోటార్ వెహికల్ పన్నుల చట్ట సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా మంత్రి పువ్వాడ అజయ్ మాట్లాడుతూ.. వాహనాల విక్రయంలో ప్రభుత్వానికి పన్నులు సరిగా వస్తాయన్నారు. పన్నులు ఎగ్గొట్టకుండా ఉండేందుకే సవరణ బిల్లు అని తెలిపారు. డీలర్ల రాయితీ నిలువరించేందుకే పన్నుల చట్ట సవరణ బిల్లు అని, లారీల అంతర్రాష్ట్ర రాష్ట్ర పన్నులపై ఏపీ అధికారులతో మాట్లాడుతున్నామన్నారు. గ్రీన్ ట్యాక్స్ అనేది కేంద్రప్రభుత్వం తెచ్చిందని సభకు తెలిపారు. ఈ చట్ట సవరణ వల్ల వినియోగదారులకు పెద్దగా ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు.

## సింగిల్ యూజ్ ఫిల్టర్ విధానంలో పేదలకు వైద్యం : హరీశ్‌రావు



హైదరాబాద్, సెప్టెంబర్ 13: తెలంగాణ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ సూపరెన్యుయేషన్ సవరణ బిల్లుకు శాసన సభ మంగళవారం ఆమోదం తెలిపింది. బిల్లును రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు సభలో ప్రవేశపెట్టగా.. సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైద్య విద్యలో పని చేస్తున్న ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల వయోపరిమితి 65 సంవత్సరాలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదన్నారు. సభలో చట్టం కూడా చేసుకున్నామని గుర్తు చేశారు. ప్రొఫెసర్లలో నుంచి కొంతమందిని టీచింగ్ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా, ప్రొఫెసర్లలో కొంత మందిని మెడికల్ ప్రిన్సిపాల్స్‌గా, కొంత మంది ప్రొఫెసర్లే అడిషనల్ డైరెక్టర్ ఎడ్యుకేషన్‌గా, డైరెక్టరేట్ మెడికల్ ఎడ్యుకేషన్‌గా నియమిం చుకుంటామన్నారు.

గతంలో బిల్లు పాస్ చేసుకున్న సమయంలో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ వరకే వయోపరిమితి బిల్లును పాస్ అయ్యిందని, కానీ రోజు ప్రిన్సిపాల్స్, సూపరింటెండెంట్లు, అడిషన్ డీఎంఈ, డీఎంఈలకు వయోపరిమితికి సంబంధించి ఆ బిల్లులో పొందుపరుచలేదన్నారు. ఇవాళ వారందరికీ 65 సంవత్సరాల వయోపరమితి వర్తింప చేస్తూ సవరణను ప్రతిపాదించినట్లు చెప్పారు. తెలంగాణ ఏర్పాటం ఏర్పాటైన నాడు ఐదు ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఉంటే ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్ ప్రతి జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని 33 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయాలని విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకున్నారన్నారు. అందులో ఇప్పటికే 17 మెడికల్ కాలేజీలు ఈ విద్యా సంవత్సరం పని చేస్తాయని, విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు ఇస్తున్నట్లు తెలిపారు. మరో 9 మెడికల్ కాలేజీ వచ్చే విద్యా సంవత్సరానికి ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

ఈ బిల్లుతో 49 మందికి ప్రయోజనం చేకూరనున్నదన్నారు. సవరణల బిల్లుపై చర్చ సందర్భంగా మంథని, దుబ్బాక ఎమ్మెల్యేలు శ్రీధర్ బాబు, రఘునందన్‌రావు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, రిక్రూట్‌మెంట్ చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు స్పందిస్తూ.. ప్రభుత్వం వచ్చాక వైద్యారోగ్యశాఖలో వేలాది మంది డాక్టర్లు, స్టాఫ్‌నర్సుల నియామక ప్రక్రియ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు. మరో వెయ్యి మంది డాక్టర్ల నియామక ప్రక్రియ చివరి దశలో ఉన్నదని తెలిపారు. ఇంటర్వ్యూలు కూడా ప్రారంభమయ్యాయని ఈ నెలాఖరు, అక్టోబర్ మొదటి వారంలో దసరా కానుగా కొత్త డాక్టర్లకు వైద్యారోగ్యశాఖలో ఉత్తర్వులు ఇవ్వబోతున్నామని ప్రకటించారు. ఇతర యూనివర్సిటీల్లో కూడా ఇప్పటికే కాంటాక్టు బేసిక్‌పై ప్రభుత్వం నియమించిందని, 800 మంది ఎస్ఆర్‌లను కౌన్సెలింగ్ ద్వారా జిల్లాల్లో నియామకం చేపట్టామన్నారు.లరాష్ట్రంలో 103 డయాలసిస్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. గతంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో డయాలసిస్ సెంటర్ లేదన్నారు. రాష్ట్రంలోని శాసనసభ నియోజకవర్గ కేంద్రంలో డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఉచితంగా సింగిల్ యూజ్ ఫిల్టర్ విధానంలో పేదలకు వైద్యం అందిస్తున్న ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమని స్పష్టం చేశారు. దుబ్బాకలో నవజాత శిశువులకు మెరుగైన అందించేందుకు, మరణాలను తగ్గించేందుకు న్యూబార్న్ స్టెబిలైజేషన్ యూనిట్‌ను ఏర్పాటు చేశామన్నారు. దుబ్బాకలో బస్తీ దవాఖాన కావాలని కోరితే మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. దుబ్బాక ఆసుపత్రిని అభివృద్ధిలో ముందుకు తీసుకుపోతామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలను ప్రజలు వినియోగించుకునేలా చొరవ చూపాలని ఎమ్మెల్యే రఘునందర్‌రావుకు మంత్రి సూచించారు.

## పథకాలు, అభివృద్ధి పనుల్లో స్వపక్షం, విపక్షం తేడా చూడం : కేటీఆర్



హైదరాబాద్, సెప్టెంబర్ 13: జీహెచ్ఎంసీ, పురపాలకసంఘాల చట్ట సవరణ బిల్లుకు రాష్ట్ర శాసనసభ ఆమోదం తెలిపింది. ఆయా సవరణలను రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సభ ఆమోదించింది. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ గతంలో ఆమోదించిన పురపాలక చట్టానికి.. తాజాగా సభ ముందుకు సవరణలు తీసుకువచ్చినట్లు తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ హైదరాబాద్‌గా ఉన్నప్పుడు.. మహానగరానికి సంబంధించి 100 వార్డులు ఉన్న సమయంలో అప్పటి జనాభా, అప్పటి వార్డుల సంఖ్య ప్రతిపాదికనగా కో ఆప్షన్ సభ్యుల సంఖ్యను ఐదుకు ప్రతిపాదించడం జరిగిందన్నారు.

ప్రస్తుతం ఈ సంఖ్యను ఐదు నుంచి 15కు పెంచుతున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత కొత్త కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం జరిగిందని, ముఖ్యంగా పట్టణీకరణ వేగంగా జరుగుతున్న నేపథ్యంలో సమీప గ్రామాల విలీనం, పెరుగుతున్న జనాభా దృష్ట్యా.. కార్పొరేషన్‌లో కూడా కో ఆప్షన్ సభ్యులను అదనంగా పెంచాలని సవరణలు ప్రతిపాదించినట్లు తెలిపారు. రాజ్యసభ సభ్యులు, శాసన సభ సభ్యులకు ఎక్స్ అఫిషియో మెంబర్ షిప్ విషయంలో ఉన్న టైపో ఎర్రర్‌ను సవరించామని, పంచాయతీరాజ్ చట్టం తీసుకుంటే.. మండల పరిషత్, జిల్లా పరిషత్‌లు గానీ నాలుగేళ్ల పాటు అవిశ్వాసం పెట్టకుండా వీలు లేకుండా అందులో చట్టం తీసుకువచ్చామో.. మున్సిపల్ చట్టాన్ని కూడా వాటితో పాటు ఒకటే ప్రాతిపదికన.. మూడేళ్లు ఉన్నదాన్ని నాలుగేళ్లకు మారుస్తూ అవిశ్వాసాన్ని తీర్మానాన్ని నాలుగేళ్లకు ప్రవేశపెట్టేలా సవరణ ప్రతిపాదించినట్లు చెప్పారు.

మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ బ్యాలెట్ బాక్సులను భద్రపరుచుకునేందుకు.. ఎన్నికల సంఘం వెసులుబాటు కోసం ప్రైవేటు వ్యక్తుల భవనాలు అద్దెకు తీసుకునేందుకు సవరణ చేస్తున్నామన్నారు. చెన్నూరు నియోజకవర్గంలోని క్యాతన్‌పల్లి అనే మున్సిపాలిటీ ఉందని, అందులో రామకృష్ణాపూర్ ప్రాంతానికి విస్తరించి ఉందని చెప్పారు. రామకృష్ణాపూర్ బాగా పాపులర్ అనీ, ఇక్కడ సింగరేణి బొగ్గు గనులు ఉన్నట్లు తెలిపారు. స్థానిక ప్రజలు, శాసన సభ్యుడి విజ్ఞప్తి మేరకు క్యాతన్‌పల్లి మున్సిపాలిటీని రామకృష్ణాపూర్ మున్సిపాలిటీగా పేరును మారుస్తు?న్నట్లు తెలిపారు. దాంతో పాటు రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో కొత్త జిల్లాలను ఏర్పాటు చేసున్నామన్న కేటీఆర్.. అందులో స్వపక్షం, విపక్షం అని తేడా లేకుండా, పద్ధతి ప్రకారం, శాస్త్రీయంగా గిరిజన ప్రాంతాల్లో భౌగోళిక విస్తీర్ణం ఎక్కువగా ఉండి, జనాభా తక్కువగా ఉన్నా, ఆ ప్రాంత ప్రజల అభివృద్ధి, సంక్షేమాన్ని కాంక్షించి కొత్త జిల్లాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఆ క్రమంలో ములుగు జిల్లాగా ఏర్పాటైందని, విపక్ష శాసనసభ్యురాలు ప్రాతినిథ్యం వహిస్తున్నప్పటికీ.. ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం.. జిల్లాగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కానీ, జిల్లాకేంద్రంగా ఏర్పాటైన ములుగు గ్రామ పంచాయతీగా ఉండడం సబబు కాదు అనే ఉద్దేశంతో ములుగు గ్రామ పంచాయతీ టర్మ్ ముగిసిన తర్వాత.. ఆటోమేటిక్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ కొత్త మున్సిపాలిటీగా ప్రకటిస్తున్నామన్నారు. ములుగు గ్రామ పంచాయతీని మున్సిపల్‌గా మార్చినందుకు సీఎం కేసీఆర్, పురపాలక మంత్రి కేటీఆర్, జిల్లా మంత్రులు సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు స్థానిక ఎమ్మెల్యే సీతక్క ధన్యవాదాలు తెలిపారు. మున్సిపల్ పరిధిలో సౌకర్యాలు కల్పించాలని, కలెక్టరేట్ నిర్మాణం వేగంగా జరిగేలా చూడాలని ఈ సందర్భంగా సీతక్క ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

### కొత్త పార్లమెంట్ భవనానికి అంబేద్కర్ పేరు పెట్టాలి: మంత్రి కేటీఆర్

కొత్తగా నిర్మిస్తున్న పార్లమెంట్ భవనానికి అంబేద్కర్ పేరు పెట్టాలని మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. దీనిపై తీర్మానం చేస్తూ ఇవాళ తెలంగాణ అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లే తెలంగాణ వచ్చిందన్నారు. అంబేద్కర్ చూపిన బాటలోనే తాము నడుస్తున్నామని తెలిపారు. స్వేచ్ఛ, సమానత్వం కోరిన వ్యక్తి అంబేద్కర్ అన్నారు. అంబేద్కర్ తత్వాన్ని టీఆర్ఎస్ ఆచరణలో చూపిందని మంత్రి తెలిపారు. అంబేద్కర్ లక్ష్యం సమానత్వం అన్నారు. తాను రాసిన రాజ్యాంగం దుర్వినియోగం అయితే, దాన్ని తానే ముందుగా తగులబెడుతానని అన్నారని మంత్రి గుర్తు చేశారు. అంబేద్కర్ చూపిన బాటలోనే తాము నడుస్తున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. భాషా ఆధిపత్యాన్ని, ప్రాంతీయ ఆధిపత్యాన్ని అంబేద్కర్ వ్యతిరేకించినట్లు మంత్రి తెలిపారు. భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రతీక పార్లమెంట్, టెంపుల్ ఆఫ్ డెమాక్రసీకి పేరు పెట్టడానికి ఇంతకు మించిన వ్యక్తి లేరు కాబట్టి.. అందుకే అంబేద్కర్ పేరును పెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని మంత్రి కేటీఆర్ తన తీర్మానంలో కోరారు.

### ఏకగ్రీవ ఆమోదం..

కాంగ్రెస్ సభాపక్ష నేత భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మంత్రి ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదం తెలుపడానికి తాము మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావంతో దేశ నిర్మాణం సాగాలన్న అంబేద్కర్ ఆశయాలను భట్టి గుర్తు చేశారు. ఈ దేశంలో స్వేచ్ఛ లేదని, ఎవరైనా స్వేచ్ఛగా మాట్లాడితే, ఐటీ దాడులతో భయపెడుతున్నారని భట్టి ఆరోపించారు. ఈ దేశ సంపద కొన్ని వర్గాలకు మాత్రమే అందుతోందని విమర్శించారు. సోదరభావం ఈ దేశంలో లేకుండా పోయిందని భట్టి ఆరోపించారు. ఒకరిపై ఒకరికి విద్వేష పరిస్థితుల్ని సృష్టిస్తున్నారని భట్టి అన్నారు. పార్లమెంట్‌కు అంబేద్కర్ పేరు పెడితే.. ఈ దేశ నిర్మాణం సరిగ్గా సాగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పంజాగుట్టలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

### 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం..

తమ తీర్మానానికి మద్దతు తెలిపిన భట్టి, ఇతర నేతలకు మంత్రి కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ మిత్రులు కూడా ఈ తీర్మానానికి మద్దతు తెలిపితే బాగుండేదన్నారు. పంజాగుట్టలో విగ్రహం ఏర్పాటు అంశంపై కేటీఆర్ స్పందిస్తూ.. 125 అడుగుల విగ్రహాన్ని ఇక్కడే, తెలంగాణ ప్రజలు, దేశ ప్రజలు గుర్తు పెట్టుకునే రీతిలో నిర్మిస్తున్నామన్నారు. ట్యాంక్‌బండ్ సమీపంలో ఆ విగ్రహ నిర్మాణం సాగుతోందన్నారు. పంజాగుట్టాలో జరిగిన సంఘటనల గురించి మంత్రి కేటీఆర్ వివరణ ఇచ్చారు. గతంలో విగ్రహాలు పెట్టిన విషయాన్ని తానేమీ కాదనడం లేదని, సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం చర్యలు తీసుకున్నట్లు మంత్రి చెప్పారు. కానీ అక్కడకు కూతవేటు దూరంలోనే 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు.

## మంత్రులు కేటీఆర్, హరీష్ రావులను కలిసిన హ్యాండ్లూమ్ కార్పొరేషన్ ఛైర్మన్ చింత ప్రభాకర్





హైదరాబాద్, సెప్టెంబర్ 13: తెలంగాణ హ్యాండ్లూమ్ కార్పొరేషన్ ఛైర్మన్ గా నియమితులైన సంగారెడ్డి జిల్లా టీఆర్ ఎస్ అధ్యక్షులు చింతా ప్రభాకర్ మంగళవారం పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, ఆర్థిక, వైద్య–ఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావులను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రులు చింతా ప్రభాకర్ కు శుభాకాంక్షలు తెలుపగ చింతా ప్రభాకర్ మంత్రలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## సికింద్రాబాద్ అగ్నిప్రమాదంలో 8కి చేరిన మృతుల సంఖ్య

హైదరాబాద్, సెప్టెంబర్ 13: సికింద్రాబాద్‌లోని ఎలక్ట్రిక్ బైక్ షోరూంలో జరిగిన అగ్నిప్రమాదంలో మృతుల సంఖ్య 8కి చేరింది. ఈ షాపులోని ఒక బ్యాటరీ పేలడంతోనే మంటలు వ్యాపించినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో పై అంతస్తులో ఉన్న రూబీ లాడ్జిపైకి మంటలు ఎగసిపడ్డాయి. దీంతో అక్కడ దట్టంగా పొగలు అలుముకొని ఊపిరాడక ఏడుగురు మరణించారు. గాయపడిన వారిని యశోద, గాంధీ ఆస్పత్రికి అధికారులు తరలించారు.

తాజాగా ఈ ప్రమాదంలో మరొకరు మరణించినట్లు తెలుస్తోంది. ప్రమాద సమయంలో లాడ్జిలో 25 మంది ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వారిలో కొందరు కిటికీల వద్ద ఉన్న పైపుల నుంచి బయటకు వచ్చేందుకు ప్రయత్నించారు. లాడ్జిలో ఉన్న 9 మందిని అగ్నిమాపక సిబ్బంది కాపాడినట్లు తెలుస్తోంది. మృతుల్లో ఒక మహిళ కూడా ఉన్నట్లు చెప్పారు. రూబీ లాడ్జి ఘటనపై దర్యాప్తులో భాగంగా లాడ్జిని అధికారులుసీజ్ చేశారు. సెల్లార్‌లో నిబంధనలకు విరుద్ధంగా షోరూం నిర్వహిస్తున్నందుకు రంజిత్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

## వీఆర్ఏలతో ముగిసిన కెటిఆర్ భేటీ.. 18 తేది వరకు సమయం ఇవ్వండి: కెటిఆర్



హైదరాబాద్, సెప్టెంబర్ 13: అసెంబ్లీలో వీఆర్ఏలతో మంత్రి కెటిఆర్ చర్చలు ముగిశాయి. కెటిఆర్ తో పాటు సీఎస్ తో చర్చించామని వీఆర్ఏలు తెలిపారు. 23 వేల మంది వీఆర్ఏల సమస్యలను పరిష్కరిస్తామని కెటిఆర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. పే స్కేల్? అర్హులకు ప్రమోషన్లు? 55 సంవత్సరాలు దాటిన వారి వారసులకు ఉద్యోగాలపై మంత్రితో చర్చించినట్లు తెలిపారు వీఆర్ఏలు. సమ్మె విరమించమని కెటిఆర్ తెలిపారన్న వీఆర్ఏలు?అయితే సమ్మె విరమించేది మాత్రం అందరితో చర్చించిన తర్వాతేనన్నారు. సీఎం ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని.. ఈ నెల 18 తేది వరకు సమయం ఇవ్వాలని కెటిఆర్ కోరినట్లు వీఆర్ఏలు తెలిపారు.

కాగా, అంతకు ముందు వీఆర్ఏల ఛలో అసెంబ్లీ తీవ్ర ఉద్రిక్తంగా మారింది. నిరసన తెలియజేసేందుకు పెద్ద సంఖ్యలో వీఆర్ఏలు హైదరాబాద్ కు తరలి వచ్చారు . సమస్యల పరిష్కారానికి చలో అసెంబ్లీ కార్యక్రమం చేపట్టారు. ఇందిపార్క్ నుంచి అసెంబ్లీ వరకు వందలాది మంది వీఆర్ఏలు ర్యాలీగా బయలు దేరారు. అసెంబ్లీ వైపు దూసుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. తెలుగు తల్లి ఫ్లై ఓవర్ దగ్గర వీఆర్ఏలను పోలీసులు అడ్డుకున్నారు . దీంతో అక్కడే బైఠాయించిన వీఆర్ఏలు సర్కార్ కు వ్యతిరేంగా నినాదాలు చేశారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అయితే వీఆర్ఏలను చెదరగొట్టేందుకు పోలీసులు ప్రయత్నం చేశారు . దీంతో తెలుగు తల్లి ఫ్లై ఓవర్ దగ్గర ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ధర్నాలో వందలాది మంది వీఆర్ఏలు పాల్గొన్నారు. పోలీసులకు, వీఆర్ఏలకు మధ్య తోపులాట జరిగింది. వెంటనే కెసిఆర్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు వీఆర్ఏలు. పే స్కేల్ ప్రకటించాలన్నారు.

# నోరు, దంతాల ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉందాం

## (12 సెప్టెంబర్ 'ప్రపంచ నోటి ఆరోగ్య దినం (వరల్డ్ ఓరల్ హెల్త్ డే)' సందర్భంగా)

మనలో చాలా మంది నోటి దుర్వాసన కారణంగా సమాజంలో స్వేచ్ఛగా తిరగడానికి, పక్కవారితో మాట్లాడటానికి భయపడతాం. దీని దృష్టిలో పెట్టుకొని 'నోటి ఆరోగ్యంతో గర్వపడదాం (బి ప్రౌడ్ ఆఫ్ యువర్ మౌత్)' అనబడే 3-ఏండ్ల (2021-23) నినాదాన్ని తీసుకున్న 'వరల్డ్ డెంటల్ ఫెడరేషన్' నోటి దుర్వాసన, దంత సమస్యలు, నోటి అనారోగ్యాల పట్ల అవగాహన కల్పించడానికి ప్రతి ఏట 12 సెప్టెంబర్‌న 'వరల్డ్ ఓరల్ హెల్త్ డే (ప్రపంచ నోటి ఆరోగ్య దినం)' వేదికను వాడుకోంటున్నది. 12 సెప్టెంబర్ 2007న ప్రారంభమైన 'ప్రపంచ నోటి ఆరోగ్య దినం' సందర్భంగా నోటి శుభ్రతకు సంబంధించిన అవగాహన కల్పిస్తారు. నోటి ఆరోగ్యంతో 32 పటిష్ఠ దంతాలతో 'శూన్య డెంటల్ కావిటీస్ (జీరో డెంటల్ కావిటీస్)' సుసాధ్యం అవుతుంది. నోటి అనారోగ్యంతో సాధారణ ఆరోగ్యానికి తీవ్ర విఘాతం అవుతుందని గమనించాలి. ఓరల్ హెల్త్ దినాన్ని 20 మార్చిన కూడా నిర్వహించుట ఆనవాయితీగా వస్తున్నది.

నోటి ఆరోగ్య జాగ్రత్తలు (ఓరల్ హెల్త్ టిప్స్):

నోటి అనారోగ్యంతో ఇతర శరీర అవయవ భాగాలు దుష్ప్రభావాలకు లోనవుతాయని తెలుసు కోవాలి. షుగర్‌లేని చూయింగ్ గమ్‌తో దంత, నోటి ఆరోగ్యం కాపాడబడుతుంది. నోటిలోని సూక్ష్మక్రిములతో (జర్మ్స్) పంటి నొప్పులు, దంత కావిటీలు (రంధ్రాలు) ఏర్పడతాయి. తక్కువ చక్కరలు కలిగిన పోషకాహారంతో నోటి ఆరోగ్యం పరిరక్షించబడుతుంది. శీతలపానీయాలు, స్నాక్స్, జంక్ ఫుడ్స్ లాంటి ఆహార పదార్థాలు నోటి అనారోగ్యానికి కారణం అవుతాయి. దంత, చిగుర్ల అనారోగ్యాలు ఆత్మవిశ్వాసాన్ని, పనిలో ఏకాగ్రతను హరిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా 3.5 మిలియన్ల ప్రజలు నోటి అనారోగ్యాలతో సతమతం అవుతున్నారని అంచనా. ఒంటరితనం, నోటి దుర్వాసన, అసౌకర్యం, నొప్పి లాంటి అనారోగ్యాలు అతి ప్రమాదకరంగా కూడా మారవచ్చు లేదా దంతాలను తొలగించే దుస్థితికి కూడా చేరవచ్చు. నోటి ఆరోగ్య పరిరక్షణలో తరుచుగా (కనీసం ఏడాదికి ఒకసారి) దంత వైద్యులను సంప్రదించాలి. ఓరల్ హెల్త్‌కు సంబంధించిన ఉపన్యాసాలు, విద్యాలయాల్లో అవగాహనలు నిర్వహించాలి. ప్రతి రోజు ఉదయం, నిద్రకు ముందు రాత్రి కూడా తప్పనిసరిగా రెండుసార్లు దంతాలను శుభ్రం (టూత్ బ్రషింగ్) చేసుకోవాలి. టూత్ బ్రషింగ్ శాస్త్రీయ పద్దతిని తెలుసుకోవాలి. నాలుకను అశ్రద్ధ చేయరాదు. టంగ్ క్లీనర్‌తో మృదువుగా శుభ్రం చేసుకోవాలి. ఫ్లోరైడ్ టూత్ పేస్టును వాడాలి. దంతాల మధ్య ఇరుక్కున్న పదార్థాలు ప్రమాదకరంగా మారుతాయని గుర్తుంచుకోవాలి. దంతాల్లో పుల్లలను (టూత్ పిక్స్) వాడరాదు. మౌత్ వాష్‌ను తరుచుగా ఉపయోగించాలి. నీటిని అధికంగా త్రాగాలి. తాజా జామ, ఆపిల్ లాంటి క్రంచీ ఫ్రూట్స్‌ను తినాలి. తక్కువ ఆమ్లత్వం ఉన్న పదార్థాలను వాడాలి. తినుబండారాలను తీసుకున్న తరువాత శ్రద్ధగా నోటిని నీటితో శుభ్రం చేసుకోవాలి. పొగాకు ఉత్పత్తులు, ఆల్కహాల్ లాంటి దురలవాట్లకు దూరంగా ఉండాలి. 'నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది' అనే నానుడిని గుర్తు చేసుకుంటూ 'నోటి ఆరోగ్యమే సంతోషకర సంపూర్ణ ఆరోగ్యానికి కారణమని' జాగ్రత్తలు తీసుకుందాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## భారతదేశంలో ఎక్స్‌ఆర్ టెక్నాలజీ స్టార్టప్‌లను వేగవంతం చేయడానికి సహకరించనున్న మైటీ స్టార్టప్ హబ్, మెటా

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13: మైటీ స్టార్టప్ హబ్ (ఎమ్ఎస్హెచ్) మెటా సహకారంతో భారతదేశం అంతటా ఎక్స్‌ఆర్ టెక్నాలజీ స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వడానికి వేగవంతం చేయడానికి ఒక ప్రోగ్రామ్‌ను ప్రారంభించనుంది. ఈ కార్యక్రమాన్ని 13 సెప్టెంబర్ 2022న ప్రకటిస్తారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్ ి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, స్కిల్ డెవలప్‌మెంట్ ి ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ల శాఖల సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ గ్లోబల్ పాలసీ, మెటా వైస్ ప్రెసిడెంట్ జోయెల్ కప్లాన్ ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. అభివృద్ధి చెందుతున్న భవిష్యత్తు సాంకేతికతలలో నైపుణ్యం కోసం ప్రభుత్వ ప్రయత్నాలలో ఈ సహకారం ఒక భాగం. సృష్టికర్తలు, డెవలపర్‌లు శక్తివంతమైన సాంకేతిక పర్యావరణ వ్యవస్థతో కూడిన పెద్ద టాలెంట్ పూల్‌తో మెటావర్స్‌లో కీలక పాత్ర పోషించడానికి భారతదేశం సంసిద్ధంగా ఉంది. డిజిటల్ ఉత్పత్తుల కోసం ఎక్కువ డిమాండ్‌ను తీర్చడానికి సరఫరా సాంకేతికత, ఆవిష్కరణ ప్రతిభ కోసం ప్రపంచం ఇండియావైపు వైపు చూస్తోంది. మైటీ స్టార్టప్ హబ్, మైటీ చొరవ, సాంకేతిక ఆవిష్కరణలు, స్టార్టప్‌లు మేధోపరమైన లక్షణాల సృష్టిని ప్రోత్సహించడంపై దృష్టి సారించిన జాతీయ వేదిక. నేడు ఇది దాదాపు 3000+ టెక్ స్టార్టప్‌లకు మద్దతునిస్తోంది. రాబోయే మూడు నుండి ఐదు సంవత్సరాల్లో పది వేలకు పైగా స్టార్టప్‌లను పెంచాలనే లక్ష్యంతో ఉంది.

## శ్రీకాకుళం జిల్లాలో భారీ వర్షాలు- జాతీయ రహదారిపై ప్రవహించిన వర్షపు నీరు



శ్రీకాకుళం , సెప్టెంబర్ 13: జిల్లాలో మంగళవారం ఉదయం 6 గంటలనుండి కురిసిన భారీ వర్షాలకు జాతీయ రహదారిపై వర్షపు నీరు నది మాదిరిగా ప్రవహించింది. పెద్దప్పాడు నుండి ఈనాడు కార్యాలయం వరకూ జాతీయ రహదారిపై నీరు ప్రవహించడంతో వాహనదారులు భయపడ్డారు. ఒక కారు నీటిలో మునిగిపోతుండగా భయంతో డ్రైవర్ కారు నుండి బయటకు వచ్చి ప్రాణాలు దక్కించికున్నాడు. జిల్లా కేంద్రమైన శ్రీకాకుళంలో ఆర్ టి సి కాంప్లెక్స్ లో మోకాలులోతు నీరు చేరడంతో ప్రయాణీకులు అవస్థలు పడుతున్నారు. కొన్ని చోట్ల వర్షపు నీటికి వరి పొలాలు మునిగిపోయాయి.

## తిరుచానూరులో పద్మావతి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు.. 26 నుంచి ఘనంగా నిర్వహణ

తిరుపతి, సెప్టెంబర్ 13: తిరుపతి తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయంలో ఈనెల 26వ తేదీ నుంచి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలు అక్టోబరు 5వ తేదీ దాకా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని టీటీడీ ఈఓ ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. నవరాత్రి ఉత్సవాలు జరిగే రోజుల్లో భక్తులు ఇబ్బందిపడకుండా అమ్మవారిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

ఇక.. తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు జరుగనున్నాయి. రోజూ ఆలయంలోని కృష్ణస్వామి ముఖ మండపంలో పద్మావతి అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరినీళ్లు, పండ్ల రసాలతో అభిషేకం చేస్తారు. సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహిస్తారు. అక్టోబరు 5వ తేదీ విజయదశమి రోజున పద్మావతి అమ్మవారు విశేషమైన గజ వాహనంపై ఊరేగి భక్తులకు దర్శనమిస్తారు. నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో 10 రోజుల పాటు కల్యాణోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను రద్దు చేస్తున్నట్టు టీటీడీ తెలిపింది. అదేవిధంగా సెప్టెంబరు 30న లక్ష్మీపూజ, అక్టోబరు 5న అష్టోత్తర శత కలశాభిషేకం సేవలను కూడా రద్దు చేశారు



# పంచాయితీ అవార్డ్స్ పోటీలో పాల్గొనేందుకు గ్రామ పంచాయతీల నుండి దరఖాస్తుల స్వీకరణ-జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్




సంగారెడ్డి, సెప్టెంబర్ 13 (నేటి నిజం ప్రతినిధి) జాతీయ పంచాయితీ అవార్డ్స్ పోటీలో పాల్గొనేందుకు గ్రామ పంచాయతీల నుండి ఆన్ లైన్ దరఖాస్తులు అక్టోబర్,31 వరకు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ తెలిపారు.

సోమవారము సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో "నేషనల్ పంచాయత్ అవార్డ్స్" కార్యక్రమంపై జిల్లా స్థాయి, మండల స్థాయి పనితీరు అంచనా కమిటీ లను ఏర్పాటు చేసి వారికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 647 గ్రామ పంచాయతీలు ఈ పోటీలలో పాల్గొనాలన్నారు. 9 కేటగిరీలలో అవార్డులను ఎంపిక చేయడం జరుగుతుందని అన్నారు.

గ్రామస్థాయి, మండల స్థాయి, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

2030 సంవత్సరం నాటికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు గ్రామ పంచాయతీ స్థాయిలో స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలలో భాగంగా 9 కేటగిరిల వారీగా గుర్తించడం జరుగుతున్నదన్నారు. ఇందులో భాగంగా 2021-22 సంవత్సరానికి గాను జాతీయ పంచాయతీ అవార్డ్ లకు గాను 9 కేటగిరిలలో పూర్తి సమాచారంతో ఎంపిడిఓ లకు అందించాలని తెలిపారు. దరఖాస్తు సందర్భంగా శాఖల వారిగా తీసుకోవలసిన చర్యలు, అంశాల వారీగా వివరాలను సంబంధిత అధికారులకు అవగాహన కల్పించారు.

గ్రామ పంచాయతీ, మండల, జిల్లా స్థాయి నిర్ణయించుటకు మెరుగైన పనులు చెసి, రికార్డుల ప్రకారం (2021-22) వివరాలు ప్రశ్నావళికి జవాబులు నమోదు చేయవలసి ఉంటుందని, పోటీలలో గెలుపొందిన పంచాయతీకి ఏప్రిల్ 24వ తేదీన అవార్డుల పంపిణీ ఉంటుందని తెలిపారు.

పంచాయతీ అవార్డులు 1). పేదరికం లేని మెరుగైన జీవనోపాధి, (2) ఆరోగ్యకరమైన పంచాయతీ, (3) బాలల స్నేహపూర్వక పంచాయతీ, (4) నీటి సమృద్ధి గల పంచాయతీ, (5) పరిశుభ్రమైన పచ్చదనం గల పంచాయతీ, (6) స్వయం సమృద్ధి, మౌళిక సదుపాయాలు ఉన్న పంచాయతీ, (7) సామాజిక భద్రత పంచాయతీ, (8) మంచి పరిపాలన, (9) మహిళా స్నేహపూర్వక పంచాయతీలుగా మొత్తం తొమ్మిది కేటగిరీలలో పోటీలలో ప్రతి పంచాయతీ పాల్గొనాలని, తొమ్మిది కేటగిరిలో ప్రశ్నావళి ప్రకారం సమాధానాలు నమోదు చేయాలనీ, ఉత్తమంగా ఉన్న వాటిలో (3) అవార్డులను ఎంపిక చేసి గ్రామ, మండల, జిల్లా స్థాయిలలో ఎంపిక చేయనున్నట్లు, జిల్లా స్థాయిలో ఎంపికైన వాటిని రాష్ట్రస్థాయిలో పోటీలలో పాల్గొనే అవకాశం కల్పించడం జరుగుతుందని తెలిపారు. జాతీయ స్థాయిలో అవార్డ్ ల పంపిణీ ఉంటుందని తెలిపారు.

ప్రతి గ్రామ పంచాయతీ 9 కేటగిరిలో దరఖాస్తు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. రెండు రోజులలోపు మండల స్థాయిలో శిక్షణ ఇవ్వాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజర్షి షా, జిల్లా పరిషత్ సీఈఓ ఎల్లయ్య, జిల్లా పంచాయితీ అధికారి సురేశ్ మోహన్, జిల్లా అధికారులు, డి ఎల్ పి ఓ లు, ఎంపీ ఓ లు, ఎంపీడీఓ లు,, తదితరులు పాల్గొన్నారు.

### ఆయుర్వేద దినోత్సవం-2022లో భాగంగా ఆయుర్వేదంపై

# 6 వారాల కార్యక్రమానికి అఖిలభారత ఆయుర్వేద ఇన్‌స్టిట్యూట్ శ్రీకారం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13: ఆయుర్వేద దినోత్సవం-2022 నేపథ్యంలో ఆయుష్ మంత్రిత్వ శాఖ పరిధిలోని అఖిలభారత ఆయుర్వేద వైద్య సంస్థ (ఏఐఐఏ) ఇవాళ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ ఏడాది ఆయుష్ మంత్రిత్వశాఖ నిర్దేశం మేరకు ఆయుర్వేద దినోత్సవం నిర్వహణ కోసం 'ఏఐఐఏ' మార్గదర్శక సంస్థగా ఎంపికైంది. ఈసారి 'ప్రతి ఇంటా.. ప్రతి రోజూ ఆయుర్వేదం' ఇతివృత్తంగా ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఆయుర్వేద దినోత్సవాలకు నాందిగా 6 వారాల కార్యక్రమానికి 'ఏఐఐఏ' శ్రీకారం చుట్టింది.

ఈ సందర్భంగా ఆయుష్ శాఖ మంత్రి శ్రీ శరబానంద సోనొవాల్, సహాయ మంత్రి డాక్టర్ ముంజపర మహేంద్రభాయ్ కాలూభాయ్, ఆ శాఖ కార్యదర్శి వైద్య రాజేష్ కొటేచా, ప్రత్యేక కార్యదర్శి శ్రీ పి.కె.పాఠక్, 'ఎన్‌సీఎస్ఐఎం' చైర్మన్ వైద్య జయంత్ దేవ్‌పూజారి తదితరులు వర్చువల్ మాధ్యమం ద్వారా హాజరయ్యారు.

ఆయుష్ మంత్రిత్వ శాఖ ప్రతి సంవత్సరం ధన్వంతరి జయంతి నాడు ఆయుర్వేద దినోత్సవం నిర్వహిస్తుండగా ఈసారి ఇది అక్టోబర్ 23న వస్తుంది. కాగా, ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వంలోని అన్ని మంత్రిత్వ శాఖలు, విభాగాలతో సంయుక్తం ఆయుష్ మంత్రిత్వ శాఖ వేడుకలు నిర్వహిస్తుంది. తద్వారా దేశంలోని ప్రతి వ్యక్తికీ సంప్రదాయ వైద్య విధానంపై అవగాహన కల్పించబడుడుతుంది.

ఈ సందర్భంగా శ్రీ సోనొవాల్ మాట్లాడుతూ- "ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక దృక్పథాన్ని ముందు తీసుకెళ్లడంలో ఈ ఆరువారాల కార్యక్రమం ఒక గొప్ప ప్రయత్నం. దేశంలోని ప్రతి పౌరుడికి మనం చేరువ కాగలిగితేనే ఈ కార్యక్రమం విజయవంతం కాగలదు. కాబట్టి రాబోయే వారాల్లో ఆయుర్వేద సందేశం నలుమూలలకూ చేరేవిధంగా ప్రజలతో మమేకమై వారిని చైతన్యపరచడానికి మనం అన్ని స్థాయిలలోనూ శాయశక్తులా కృషి చేద్దాం. ఈ మేరకు 'సంపూర్ణ ఆరోగ్యానికి ఆయుర్వేదం'పై అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని 'ప్రతి ఇంటా.. ప్రతి రోజూ ఆయుర్వేదం' నినాదం నొక్కిచెబుతోంది. మన దేశం ఆరోగ్యంగా-శక్తిమంతంగా రూపొందడానికి ఇది ఎంతగానో తోడ్పడుతుంది" అన్నారు.

డాక్టర్ మహేంద్రభాయ్ తన అభిప్రాయం వెల్లడిస్తూ- "ఇతర దేశాల సహకారంతో ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఇంటికీ ఆయుర్వేదాన్ని చేరువ చేయడం ద్వారా 'ఆరోగ్యకర భారతదేశం నుంచి ఆరోగ్యకర ప్రపంచందాకా..' అనే దృక్పథాన్ని సాకారం చేయడం లక్ష్యంగా ముందడుగు వేస్తున్నాం" అని వివరించారు. ఆరువారాల కార్యక్రమం, ఇందులోని కీలకాంశాల గురించి 'ఏఐఐ' డైరెక్టర్ ప్రొఫెసర్ తనూజా నేసరి వివరించారు. ఈ మేరకు మూడు 'జె'లు... "జన సందేశం.. జన భాగస్వామ్యం, జన ఉద్యమం" లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు ఇందులో పాలుపంచుకుంటాయని వెల్లడించారు.

# అధికారిక సమావేశాలు మరియు క్యాంటీన్లలో చిరు ధాన్యాల ఉత్పత్తులను ఉపయోగించాలని నిర్దేశించిన ఆహార మరియు ప్రజా పంపిణీ శాఖ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13: చిరు ధాన్యాల వినియోగాన్ని ప్రోత్సహించడానికి, వాటి ఆరోగ్య ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, ఆహార మరియు ప్రజా పంపిణీ శాఖ (డీఎఫ్‌పీడీ) యొక్క అన్ని కార్యాలయాలు ఇటీవల తమ క్యాంటీన్‌లలో మరియు సమావేశాలలో చిరు ధాన్యాల ఉత్పత్తులను ప్రవేశపెట్టి ప్రచారం చేయాలని ఆదేశించాయి.

చిరు ధాన్యాలను రాగి బిస్కెట్లు/కుకీలు/లడ్డూలు, బేక్ చేసిన మిల్లెట్ చిప్స్ మొదలైనవి తయారు చేసి స్నాక్స్/బిస్కెట్‌లలో ఒకటిగా వీటిని చేర్చవచ్చు. మిల్లెట్/రాగి దోస, మిల్లెట్ మిక్స్ వడ, మిల్లెట్ మిక్స్ పూరీ మరియు ఇడ్లీ / రాగి లడ్డు మొదలైనవి (మిల్లెట్ వంటి ప్రధాన ముడి పదార్థం కలిగి ఉండటం) క్యాంటీన్‌లలో ఉపయోగించాలి. వీలైనంత వరకు స్థానికంగా లభించే మిల్లెట్ ఆధారిత ఉత్పత్తులను ఉపయోగించాలి.

2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరు ధాన్యాల సంవత్సరం (ఎజనీఓ)గా నిర్వహించనున్నారు. డీఎఫ్‌పీడీ దేశంలో మినుముల సేకరణ/ వినియోగాన్ని మరియు ఘఖఆ/ఎఅఆ/ఓఆఓ పథకాలలో పంపిణీ కోసం సేకరించిన చిరు ధాన్యాల వినియోగాన్ని చురుకుగా ప్రోత్సహిస్తోంది. చిరు ధాన్యాల వినియోగం అనేక ప్రయోజనాలను అందిస్తుంది. జీవన శైలి వ్యాధుల నిర్వహణలో సహాయపడుతుంది. విటమిన్లు, ఖనిజాలు, ఫైటో కెమికల్స్ మరియు డైటరీ ఫైబర్ వంటి పోషకాల యొక్క అధిక సాంద్రత కారణంగా, మిల్లెట్లు పోషకాహార లోపం మరియు సూక్ష్మపోషక లోపాన్ని తగ్గించడానికి కూడా అద్భుతమైన ప్రయోజనకారి.

# టిటిడి ఆధ్వర్యంలోని పలు ట్రస్టులకు విరాళాలు అందజేసిన- వెల్లంకి రాజ రాజేశ్వరి దేవి

హైదరాబాద్, సెప్టెంబర్ 13: హైదరాబాద్ కి చెందిన ఓ దాత టీటీడీ ఆధ్వర్యంలోన పలు ట్రస్టులకు విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు తిరుపతి శ్రీ పద్మావతి విశ్రాంతి గృహంలో జేఈఓ శ్రీమతి సదా భార్గవికి డిమాండ్ డ్రాఫ్ట్ అందజేశారు.

హైదరాబాద్‌కు చెందిన శ్రీవారి భక్తురాలు శ్రీమతి వెల్లంకి రాజ రాజేశ్వరి దేవి ..తన భర్త స్వర్గీయ వెల్లంకి చక్రపాణి జ్ఞాపకార్థం విద్యాదానం ట్రస్టుకు రూ.10 లక్షల 1116, మనవళ్ళు, మనవరాళ్ళ పేరిట గో సంరక్షణ ట్రస్టుకు రూ.2 లక్షలు, అన్నదానం ట్రస్టుకు రూ.2లక్షలు, ప్రాణదానం ట్రస్టుకు రూ.1 లక్ష.. మొత్తం రూ.15 లక్షల 1116 విరాళం అందించారు. ఈ సందర్భంగా దాతను జేఈఓ శ్రీమతి సదా భార్గవి అభినందించారు. అనంతరం ఆమెకు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. టీటీడీ విద్యావిభాగం డిప్యూటి ఈఓ గోవిందరాజన్ , టీటీడీ ఉద్యోగుల సహకార బ్యాంక్ డైరెక్టర్ చింతాల శివకుమార్ తదితరులు కూడా పాల్గొని దాత వెల్లంకి రాజరాజేశ్వరి దేవిపై ప్రశంసలు కురిపించారు.

## పత్తి చేనులో వృద్ధుడి ఆత్మహత్య..




వరంగల్, సెప్టెంబర్ 13: ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని నారాయణగిరి పల్లె గ్రామ పంచాయతీ పరిధిలో ఓ పత్తి చేనులో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధర్మసాగర్ కొత్తపల్లి గ్రామానికి చెందిన సంగెం లచ్చయ్య పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తాజుద్దీన్ తెలిపారు. పాలంపేట- ములుగుకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉన్న సిమెంట్ బ్రిక్స్ సమీపంలో సదరు వ్యక్తి అచేతనంగా పడి ఉండడం చూసి స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు ఆ వ్యక్తి మరణించినట్టుగా గుర్తించారు. మృతదేహం పక్కనే క్రిమిసంహారక మందు డబ్బా ఉండడంతో అది తాగి మరణించి ఉంటారని ప్రాథమిక అంచనాకు వచ్చారు. వృద్ధుడు ఇంతదూరం వచ్చి ఆత్మహత్య చేసుకోవడానికి కారణాలు తెలియరాలేదు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## తిరుమలలో భక్తుల రద్దీ.. శ్రీవారి దర్శనానికి 14 గంటల సమయం



తిరుమల, సెప్టెంబర్ 13: కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దర్శనానికి తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. నేడు స్వామివారి సర్వదర్శనానికి 29 కంపార్ట్‌మెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. సర్వదర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. సోమవారం శ్రీవారిని 74,231 మంది భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నిన్న శ్రీవారి హుండీ ఆదాయం 5.14 కోట్లు వచ్చినట్టు తిరుమల తిరుపతి దేవస్థానం వెల్లడించింది. 33,591 మంది భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించారు.

## నెగ్గిన అవిశ్వాస తీర్మానం

### -పదవి నుండి దిగిపోయిన ముత్యంపేట ఉపసర్పంచ్ శిరీష్ గౌడ్



కామారెడ్డి, సెప్టెంబర్ 13:(నేటినిజం ప్రతినిధి): కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం ముత్యంపేట ఉప సర్పంచ్ పై అవిశ్వాస తీర్మానం నెగ్గింది. దీనితో ముత్యంపేట ఉపసర్పంచ్ ముత్తగౌని శిరీష్ గౌడ్ తన పదవిని కోల్పోయారు. కామారెడ్డి ఆర్ డి ఓ శ్రీను అవిశ్వాస తీర్మానంపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఓటింగ్ జరిపారు. అవిశ్వాసానికి అనుకూలంగా ఏడు ఓట్లు వ్యతిరేకంగా ఆరు ఓట్లు రావడంతో వార్డు సభ్యులు సర్పంచ్ పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గిందని ముత్యంపేట సర్పంచ్ సూర్యప్రకాశ్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేశాడని ఉప సర్పంచ్ శిరీష్ గౌడ్ పై గ్రామస్తుల సహకారంతో వార్డు సభ్యులు అవిశ్వాస తీర్మానం పెట్టారు. వార్డు సభ్యులు పెట్టిన అవిశ్వాస తీర్మానంపై కామారెడ్డి ఆర్ డి ఓ శ్రీను ఈరోజు ప్రత్యేక సమావేశం గ్రామపంచాయతీ భవనంలో ఏర్పాటు చేసి ఓటింగ్ జరిపారు. ఉప సర్పంచ్ పై అవిశ్వాస తీర్మానంలో సగానికి అంటే ఎక్కువ వార్డు సభ్యులు అవిశ్వాసం కు అనుకూలంగా ఓటు వేయడంతో ఉపసర్పంచ్ ముత్తగోని శిరీష్ గౌడ్ పై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. అవిశ్వాస తీర్మానం నెగ్గాక విలేకరులతో సర్పంచ్ వార్డు సభ్యులు మాట్లాడారు. మాజీ ఉపసర్పంచ్ శిరీష్ గౌడ్ ప్రభుత్వ స్కూలు స్థలాన్ని 1200 గజాల స్థలాన్ని ఆక్రమించే ప్రయత్నం చేయడంతో గ్రామస్తుల సహకారంతో వార్డు సభ్యులు అవిశ్వాసం పెట్టారని తెలిపారు. గ్రామస్తులందరి సహకారం వార్డు సభ్యుల ఓటింగ్ తో ఉప సర్పంచ్ పై అవిశ్వాసం నెగ్గిందని ఇది ముత్యంపేట గ్రామ ప్రజల విజయమని సర్పంచ్ సూర్యప్రకాష్ రెడ్డి తెలిపారు.

## జాతీయ సమైక్యత వజ్రోత్సవాలలో భాగంగా సంస్కృతి అంశాలపై కవి సమ్మేళనం

మెదక్, సెప్టెంబర్ 13: నేటినిజం (ప్రతినిధి):జాతీయ సమైక్యత వజ్రోత్సవాలలో భాగంగా ఈ నెల 18 న సమీకృత కలెక్టరేట్ లో తెలంగాణ జాతీయ సమైక్యత, తెలంగాణ సంస్కృతి అంశాలపై కవి సమ్మేళనం నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ ఎస్.హరీష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కవి సమ్మేళనంలో పాల్గొనదలచిన కవులు పై అంశాలపై 20 పంక్తులు మించకుండా స్వీయ రచన చేసి ఉండాలని అన్నారు. తమ కవితలను ఈ నెల 16 లోగా కలెక్టరేట్ లోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు. స్క్రీనింగ్ కమిటీ వీటిని పరిశీలించి ఆమోదించిన కవులు మాత్రమే ఈ కవి సమ్మేళనంలో పాల్గొనుటకు అవకాశముంటుందని ఆయన స్పష్టం చేశారు. వివరాలకు కవి సమ్మేళనం సమన్వయాధికారి రాజిరెడ్డి ఫోన్ నెంబర్ 8328599157 కు సంప్రదించవలసినదిగా కలెక్టర్ సూచించారు.

# రాజధాని లేని ఏకైక రాష్ట్రం ఏపీ : సాకే శైలజానాథ్

అమరావతి, సెప్టెంబర్ 13: రాజధాని లేని రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ఒక్కటే అని ఏపీ పీసీసీ చీఫ్ సాకే శైలజానాథ్ వ్యాఖ్యానించారు. రాజధాని ఏర్పాటు విషయంలో జగన్ ప్రభుత్వం తమ చేతగానితనాన్ని విడనాడాలన్నారు. రాయలసీమవాసులుగా తామెంతో బాధపడుతున్నప్పటికీ అమరావతిని రాజధానిగా చేసేందుకు అండగా నిలిచామని పేర్కొన్నారు. మూడు రాజధానుల ఏర్పాటు ఎందుకోసమో సీఎం జగన్ వెల్లడించాలని శైలజానాథ్ డిమాండ్ చేశారు.

శ్రీభాగ్ ఒప్పందంపై ముఖ్యమంత్రి జగన్‌కు కనీస అవగాహన లేదని, అమరావతి ఏకైక రాజధానిగా ప్రకటిస్తే జగన్‌కే మంచిదని శైలజానాథ్ చెప్పారు. ముఖ్యమంత్రిగా జగన్ ఎప్పుడు కూడా ప్రజల్లో, రోడ్ల మీద తిరగలేదని, అలా తిరిగితే ఆయన రాష్ట్రంలోని వాస్తవ పరిస్థితులు తెలిసేవన్నారు. పోలీసులను అడ్డం పెట్టుకుని అరెస్టులు చేయిస్తూ అదే పరిపాలన అని భ్రమలో సీఎం జగన్ ఉన్నారని దుయ్యబట్టారు. ఆనాడు అమరావతికి జైకొట్టిన జగన్.. ఇవాళ మూడు రాజధానుల మాటెత్తడం ఎందుకో స్పష్టం చేయాలన్నారు. మూడు రాజధానుల ప్రకటన కేవలం ప్రజల మధ్య విద్వేషాల కోసమే అని అభిప్రాయపడ్డారు. ఇకనైనా జగన్ తన మొండి పట్టుదలను వీడి అమరావతిని రాజధానిగా అభివృద్ధి చేయాలని హితవు పలికారు.

# 50 మంది ఎమ్మెల్యేల పనితీరుపై వైసీపీ అధినేత అసంతృప్తి..

విజయవాడ, సెప్టెంబర్ 13: గతంలో హెచ్చరించినట్లుగానే దాదాపు 50 మంది ఎమ్మెల్యేల పనితీరుపై వైసీపీ అధినేత అసంతృప్తిగా ఉన్నట్లు తేలింది. వీరికి వార్నింగ్ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయని పార్టీ వర్గాలు తెలిపాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేల పనితీరుపై సర్వే బృందం నుంచి జగన్‌కు నివేదిక అందినట్లు సమాచారం. ఈ నివేదికపై జగన్ సీరియస్‌గా ఉన్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

దాదాపు 50 మంది ఎమ్మెల్యేల పనితీరు సంతృప్తికరంగా లేకపోవడం పట్ల వైసీపీ అధినేత సీరియస్‌గా ఉన్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ఇలాంటి వారిని పిలిచి క్లాసు తీసుకున్న జగన్.. పనితీరు మెరుగుపరుచుకోవాలని హెచ్చరిక జారీ చేశారని సమాచారం. ఒక్కొక్కరిని పిలిచి మాట్లాడుతున్న జగన్.. వారు చేస్తున్న తప్పులను, ఎలా ముందుకు పోతే ప్రజల్లో పేరు పొందవచ్చో కూడా చెప్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. తీరు మార్చుకోనిపక్షంలో వచ్చే ఎన్నికల్లో మరో దఫా ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కోల్పోతారని హెచ్చరించినట్లుగా తెలుస్తున్నది. టీడీపీ ఆరోపణలను తిప్పికొట్టడంలో విఫలమైన మంత్రులను ఘాటుగా హెచ్చరించిన విషయం తెలిసిందే.

మిషన్ 2024పై ఆసక్తిగా ఉన్న వైసీపీ అధినేత జగన్.. వివిధ సర్వేల ద్వారా మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరుపై కన్నేసి ఉంచారు. కొత్తగా చేరిన కొందరు మంత్రుల పనితీరుపై కూడా అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల ముగిసిన క్యాబినెట్ సమావేశంలో కొందరు మంత్రులకు వార్నింగ్ ఇచ్చినట్లు కూడా తెలుస్తున్నది. ఈ నేపథ్యంలోనే టీడీపీ నేతల ఆరోపణలపై కౌంటర్ ఇచ్చేందుకు మాజీ మంత్రులు, మంత్రులు మీడియా ముందుకు వస్తున్నట్లు కనిపిస్తున్నది.

# సాగునీటి ప్రాజెక్టులపై ద్వంద్వ వైఖరి లేదు: మంత్రి అంబటి రాంబాబు

అమరావతి, సెప్టెంబర్ 13: తమ ప్రభుత్వానికి సాగునీటి ప్రాజెక్టులపై ద్వంద్వ వైఖరి లేదని ఏపీ నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. తమ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని, చంద్రబాబు చూపినట్లు ప్రాజెక్టులపై రోజుకో వైఖరి చూపమన్నారు. మంగళవారం నంద్యాలలో మంత్రి అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబుపై తీవ్ర విమర్శలు చేశారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైసీపీ ప్రభుత్వం పోలవరాన్ని పూర్తి చేసి జాతికి అంకితం చేస్తుందని మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. చంద్రబాబు ప్రాజెక్టులను విస్మరించారని, సాగునీటి ప్రాజెక్టులపై టీడీపీ అధినేత గతంలో ఏనాడూ పట్టించుకోలేదని, ఇప్పుడు రాష్ట్రం నష్టపోతున్నదని ఆరోపించారు. ప్రతీ ప్రాజెక్టును పూర్తి చేయడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల గేట్లకు మరమ్మతులు చేస్తున్నామని చెప్పారు. రైతుల పక్షపాతి అయిన వైఎస్ఆర్ కుటుంబం రైతులకు ఎల్లవేళలా అండగా ఉంటుందని పేర్కొన్నారు.

చంద్రబాబు హయాంలో కరువుతో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని మంత్రి అంబటి రాంబాబు అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో గత మూడేండ్లుగా వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నందున రైతులు ఇవాళ వానం కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేదని అన్నారు. గతంలో కన్నా పంటలు ఎక్కువగా పండుతున్నాయని, మళ్లీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నపూర్ణమ్మగా మారుతుండటం శుభపరిణామమన్నారు. రైతులు ఎలాంటి ఇబ్బంది పడకుండా తమ ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా తాము పనిచేస్తున్నామని తెలిపారు.

# మండిపోతున్న కూరగాయల ధర..

హైదరాబాద్, సెప్టెంబర్ 13: హైదరాబాద్ నగరంలో కూరగాయల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. వారంరోజులుగా కురుస్తున్న వర్షాల ప్రభావం కూరగాయలపై పడింది. ఎడతెరిపి లేని వర్షాలతో కూరగాయ పంటపొలాలు నీట మునిగిపోవడం, ఉన్న వాటిని కూడా హైదరాబాద్‌కు చేర్చలేని పరిస్థితుల్లో నగరంలోని ప్రధాన మార్కెట్లతో పాటు రైతుబజార్లు కూడా ఖాళీగా దర్శనం ఇస్తున్నాయి. టమాట ధర కొండెక్కి కూర్చుంది. ఆగస్టు మొదటి వారంలో కిలోకు రూ. 10 ఉన్న టమాట నెలరోజుల్లోనే రూ. 50 దాటింది. బీరకాయ, చిక్కుడు, వంకాయ, బెండ, కాకర, క్యారెట్ తదితర అన్ని కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. ఏ కూరగాయలైనా కనీస ధర కిలోకు రూ. 60 నుంచి రూ. 80 పలుకుతున్నాయి..

బోయనపల్లి మార్కెట్లో సాధారణ రోజుల్లో 30వేల నుంచి 40వేల క్వింటాళ్లు, గుడిమల్కాపూర్, ఎన్టీఆర్ మార్కెట్లో 10వేల క్వింటాళ్ల కూరగాయలు సరఫరా అయ్యేవి. గత వారం రోజులుగా 30నుంచి 40శాతం కూడా రాని పరిస్థితి నెలకొంది. ఇక నగరంలోని 11ప్రధాన రైతుబజార్లలో సైతం అంతంత మాత్రంగానే కూరగాయలు రవాణా అవుతున్నాయి. వర్షాలకు పంటలు దెబ్బతినడంతో రాబోయే రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది.కోటి మందికి పైగా ఉన్న హైదరాబాద్ నగరానికి ప్రతిరోజు దాదాపు 300 మెట్రిక్ టన్నుల కూరగాయలు అవసరం ఉంటుంది. నగరప్రజల అవసరాలకు సరిపడా దిగుమతి లేకపోవడంతో నగరంలో ఉన్న మూడు హోల్‌సెల్ మార్కెట్లైన గుడిమల్కాపూర్, బోయినపల్లి, ఎన్టీఆర్ మార్కెట్లు కూరగాయలు లేక వెలవెలపోతున్నాయి రంగారెడ్డి, మేడ్చల్, మెదక్, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి తదితర చుట్టు పక్క జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్‌ల నుంచి దిగుమతి అవుతాయి. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు నగరానికి రవాణా అయ్యే రాష్ట్రాల్లో కూడా వర్షాల ప్రభావంతో పంటలు బాగా దెబ్బతిన్నాయి. దాంతో నగరానికి రవాణా సగానికి సగంతగ్గిందని, రాబోయే రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

**కూరగాయల ధరలు**

టామాట రూ.50 నుంచి రూ.60
బెండకాయ రూ.50 నుంచి రూ.60
కాకర రూ.70 నుంచి రూ.80
చిక్కుడు రూ.70 నుంచి రూ.80
క్యారెట్ రూ.70 నుంచి రూ.80
క్యాప్సికమ్ రూ.70 నుంచి రూ.80
బీరకాయ రూ.70 నుంచి రూ.80
దొండకాయ రూ.70 నుంచి రూ.80

# మోటార్ వెహికల్ పన్నుల చట్ట సవరణ బిల్లు

## - లారీల అంతర్రాష్ట్ర పన్నుల సమస్య త్వరలోనే పరిష్కారిస్తాం
## - అనివార్యంగా గ్రీన్ ట్యాక్స్‌ను కేంద్ర ప్రభుత్వం విధించింది
## - అసెంబ్లీలో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ



ఖమ్మం, సెప్టెంబర్ 13: (నేటినిజం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు ఎగ్గొట్టకుండా ఉండేందుకే మోటార్ వెహికల్ పన్నుల సవరణ బిల్లు అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తెలిపారు.

అసెంబ్లీ సమావేశాలలో భాగంగా సభలో బిల్లు ప్రవేశపెట్టిన అనంతరం నేడు మంగళవారం మోటార్ వెహికల్ పన్నుల చట్ట సవరణ బిల్లుపై అసెంబ్లీలో చర్చ సందర్భంగా మంత్రి పువ్వాడ అజయ్ మాట్లాడారు.

వాహనాల విక్రయంలో మోటార్ వెహికల్ పన్నుల సవరణ బిల్లు ద్వారా ప్రభుత్వానికి పన్నులు సరిగా వస్తాయని మంత్రి అన్నారు. డీలర్ల రాయితీ నిలువరించేందుకే పన్నుల చట్ట సవరణ బిల్లు అని ఈ చట్ట సవరణ వల్ల వినియోగదారులకు పెద్దగా ఇబ్బంది ఉండదని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ స్పష్టం చేశారు.

తెలంగాణ మోటారు వాహన పన్నుల చట్టం 1963లోని సెక్షన్ 2కి సవరణ చేయాలని ప్రతిపాదించామని వాహనం ధరపై ఎటువంటి నిర్వచనం లేనందున వాహనం ధర యొక్క నిర్వచనాన్ని క్లాజ్ (ఏ) తర్వాత క్లాజ్ (ఏఏ)గా చట్టంలో చేర్చినట్లు మంత్రి వివరించారు.

వాహనం యొక్క ధర తయారీదారు నిర్ణయించిన వాహనం యొక్క ఎక్స్ - షోరూమ్ ధర కంటే తక్కువగా ఉండకూడదన్నారు.

దిగుమతి చేసుకున్న మోటారు వాహనం విషయంలో, బిల్ ఆఫ్ ఎంట్రీలో చూపిన ధర కస్టమ్స్ డ్యూటీ, సేల్స్ టాక్స్ లేదా జీఎస్టీ వర్తించే విధంగా ఏదైనా ఇతర విధింపు కలిగి ఉంటుందన్నారు.

డీలర్లు డిస్కౌంట్ చూపించిన తర్వాత ఇన్‌వాయిస్‌లు జారీ చేస్తున్నారని అందువల్ల ఇన్‌వాయిస్ ధర ఎక్స్ - షోరూమ్ ధర కంటే తక్కువగా ఉంటుందని దాని ఫలితంగా ప్రభుత్వానికి లైఫ్ టాక్స్‌లో రాబడి నష్టం జరుగుతుందన్నారు.

మోటారు వాహనాల జీవిత పన్ను చెల్లింపుల్లో అవకతవకలను అరికట్టేందుకు 1963 ఎంవీ యాక్ట్‌ను సవరించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఆయా వాహనాలపై జీవితపన్నును తగ్గించుకునేందుకు ఖరీదు ఎక్కువైనప్పటికీ తక్కువ ధరతో ఇన్‌వాయి?సలు సృష్టించి రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు సవరణ బిల్లును ప్రవేశపెట్టామని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు.

రాష్ట్రంలోని అన్ని ఆటోమొబైల్ డీలర్లు వాహనం యొక్క నిర్దిష్ట వేరియంట్ ధర యొక్క ఏకరూపతను నిర్ధారించడానికి ఈ బిల్లు ఎంతో దోహద పడుతుందన్నారు.

లారీల అంతర్రాష్ట్ర పన్నులపై ఏపీ అధికారులతో మాట్లాడుతున్నామని త్వరలోనే ఈ సమస్య పరిష్కారమవుతుంది అని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ చెప్పారు.

గ్రీన్ ట్యాక్స్ అనేది కేంద్రప్రభుత్వం తెచ్చిందని అనివార్యంగా ఇతర రాష్ట్రాలతో సమానంగా ఆలోచించి సహేతుకంగానే తెలంగాణలో పన్నును విధించామని వెల్లడించారు.

అలానే రాష్ట్రంలో ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు రవాణా సౌకర్యం కొరకు ఆర్టీసీ బస్సు ఉచిత పాసులు అంశాన్ని పరిశీలించి పరిష్కరిస్తామని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు.

# పోలవరం వల్ల భద్రాచలానికి ముమ్మాటికీ ప్రమాదం

## - జై శ్రీరామ్ అంటారు రాముడు నడయాడిన నేలను పట్టించుకోరు : కేంద్రంపై మంత్రి పువ్వాడ ఫైర్
## - అసెంబ్లీలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ.

ఖమ్మం, సెప్టెంబర్ 13: (నేటినిజం ప్రతినిధి): ఏపీలో నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు వల్ల తెలంగాణలోని భద్రాచలానికి ప్రమాదం పొంచి ఉందని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మంగళవారం అసెంబ్లీలో గళమెత్తారు.

ఇటీవల వరదలకు భద్రాచలం వద్ద ప్రజలు నిరాశ్రయులవుతుంటే సీఎం కేసీఆర్ శ్రీరాముడి వలె రక్షించారని పేర్కొన్నారు.

ఏపీలో నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు వల్ల తెలంగాణలోని భద్రాచలానికి ప్రమాదం పొంచి ఉందని దాని నివారణకు కేంద్రం చర్యలు తీసుకోవాలని, ప్రాజెక్టు ఎత్తును తగ్గించాలని డిమాండ్ చేశారు. దీనిపై కేంద్ర జల సంఘం, గోదావరి నదీ యాజమాన్య బోర్డు కూడా సరైన అధ్యయనం చేయాలని మంత్రి డిమాండ్ చేశారు.

పోలవరం బ్యాక్ వాటర్ నష్టాలపై కేంద్రం ఒక అంచనా వేయాలని కోరారు. భద్రాచలం చుట్టూ ఉన్న ఐదు గ్రామాలను తెలంగాణకు తిరిగి ఇవ్వాలని మరోసారి ఆయన డిమాండ్ చేశారు.

పోలవరం ప్రాజెక్టును తొలుత 36 లక్షల క్యూసెక్కుల సామర్థ్యంతో డిజైన్ చేసి, ఆ తరువాత 50 లక్షల క్యూసెక్కులకు పెంచారని పెంచిన సామర్థ్యం మేరకు వాటిల్లే ముంపుపై కేంద్ర ప్రభుత్వం సరైన అధ్యయనం చేయలేదని ఆరోపించారు.

పోలవరం ప్రాజెక్టు డిశ్చార్జి కెపాసిటీని 36 లక్షల క్యూసెక్కుల నుంచి 50 లక్షలకు పెంచి ప్రాజెక్టు ఎత్తును పెంచకుండా, వెడల్పును విపరీతంగా పొడిగించారని ఆరోపించారు.

దాని ఫలితంగా నీటి నిల్వ సామర్థ్యం కూడా పెరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలోనే భద్రాచలం కు మరింత ముంపు ఏర్పడుతుందని అన్నారు.

మొత్తంగా మార్చిన ప్రాజెక్టు సామర్థ్యం మేరకు ముంపుపై కేంద్ర ప్రభుత్వం అధ్యయనం చేయించి రక్షణ చర్యలు చేపట్టడంతో పాటు రిహాబిలిటేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

జై శ్రీరామ్ అని నినాదించే బీజేపీ నాయకులు భద్రాద్రి రామయ్య కు ముంపు వాటిల్లే ప్రమాదం ఉంటే ఎందుకు మాట్లాడారని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ప్రశ్నించారు.

# కర్నాటక కాషాయ ప్రభుత్వంపై కాంగ్రెస్ ప్రచారాస్త్రం!




బెంగళూర్ , సెప్టెంబర్ 13: కర్నాటకలో బీజేపీ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని ఆరోపణలు గుప్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఈ అంశంపై మంగళవారం పెద్ద ఎత్తున ప్రచారోద్యమాన్ని చేపట్టింది. 40పర్సెంట్‌సర్కార.కాం అనే వెబ్‌సైట్‌లో అవినీతిపై సమాచారం అందించాలని, ఫిర్యాదులు నమోదు చేయాలని రాష్ట్ర పౌరులను ఆ పార్టీ కోరింది. ఇక అవినీతిపై చర్చకు సమయం, వేదిక ఖరారు చేయాలని కాంగ్రెస్ సీనియర్ నేత సిద్ధరామయ్య కర్నాటక సీఎం బసవరాజ్ బొమ్మైకి సవాల్ విసిరారు.

రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం లూటీదారులు, స్కామ్‌స్టర్లతో నిండిన 40 పర్సెంట్ సర్కార్‌గా ఆయన అభివర్ణించారు. తాము చేపట్టిన ఈ ప్రచారోద్యమం కన్నడిగులు పాల్గొని బీజేపీకి వ్యతిరేకంగా తమ గళం వినిపించాలని కోరారు. ఈ ప్రచారంలో భాగంగా తమ వెబ్‌సైట్‌ను సంప్రదించి అవినీతిపై ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు. బెలగావిలో కాంట్రాక్టరు ఆత్మహత్య కేసులో మంత్రి కేఎస్ ఈశ్వరప్పకు వ్యతిరేకంగా బలమైన ఆధారాలున్నా ప్రభుత్వం ఆయనకు క్లీన్‌చిట్ ఇచ్చిందని కాంగ్రెస్ ఆరోపించింది.

రూ 4 కోట్ల విలువైన రోడ్డు పనులకు ఈశ్వరప్ప ఆయన అనుచరులు బిల్లులు విడుదల చేయలేదని, తనను 40 శాతం కమిషన్ అడిగారని కాంట్రాక్టర్ సంతోష్ పాటిల్ బలవన్మరణానికి ముందు ఆరోపించిన విషయాన్ని కాంగ్రెస్ ప్రస్తావించింది. మంత్రులు అశ్వథ్ నారాయణ్, అరగ జ్ఞానేంద్ర, సుధాకర్‌లు కోట్ల రూపాయల అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించింది. రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టి సాగునీటి ప్రాజెక్టుల నుంచి బీజేపీ రూ 21,473 కోట్లు కొల్లగొట్టిందని ఆరోపించింది. బీజేపీ పాలనపై పెల్లుబుకుతున్న ఫిర్యాదులను స్వీకరించి వాటిపై పోరాడతామని కాంగ్రెస్ పేర్కొంది.

# సీఎం కేసీఆర్ వల్లే ఫ్లోరైడ్ అంతమైంది : మంత్రి జగదీష్ రెడ్డి



నల్లగొండ , సెప్టెంబర్ 13: కాంగ్రెస్ పాలనలో మునుగోడులో కరువు తాండవించింది. ఫ్లోరైడ్ భూతం చుట్టుముట్టింది. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాతే మునుగోడు దశ తిరగింది. ఫ్లోరైడ్ అంతమైందని విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు.

మర్రిగూడెం, గట్టుప్పల్ మండల కేంద్రాల్లో టీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది.

ఈ కార్యక్రమాలకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వమే మనందరికి శ్రీరామ రక్ష. గులాబీ జెండా నీడలోనే ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారని ఆయన తెలిపారు. ఇతర రాష్ట్రాల ప్రజలు సైతం సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని కోరుతున్నారు. అందుకే కేంద్రం కేంద్రం సీఎం కేసీఆర్‌ను చూసి ఓర్వడం లేదన్నారు.

తెలంగాణపై విషం చిమ్ముతూ బీజేపీ నాయకులు మిడతల్లాగా వచ్చి తెలంగాణాపై దాడి చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. అయితే కేసీఆర్‌ను అపే శక్తి ఎవ్వరికి లేదన్నారు. దేశ ప్రజలు తెలంగాణా సాధించిన విజయాల గురించి మాట్లాడుతున్నరు. అందుకే బీజేపీ నాయకులు కేసీఆర్ పేరు వింటేనే బెంబేలెత్తిపోతున్నారు.

మునుగోడులో గులాబీ పార్టీ కార్యకర్తలు సైనికులవ లే పని చేయాలని, బీజేపీ కుట్రల్ని ఎక్కడికక్కడ తిప్పి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. మునుగోడులో గెలిచేది టీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు,

జడ్పీ చైర్‌పర్సన్ బండా నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, ఉన్నారు.

# తెలంగాణ పారిశ్రామిక ప్రగతిపై.. హర్యానా రాష్ట్ర అధికారుల స్టడీ



హైదరాబాద్, సెప్టెంబర్ 13: తెలంగాణ రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిపై అధ్యయనం చేయడానికి హర్యానాకు చెందిన పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థకు (హెచ్ఎస్ఐఐసీ) చెందిన ఉన్నతాధికారుల బృందం మంగళవారం హైదరాబాద్‌కు వచ్చింది. ఈ సందర్భంగా నగరంలోని టీ-హబ్ బహుళ అంతస్థుల భవనం, దండుమల్కాపూర్ ఎంఎస్ఎంఈ పార్క్, రావిర్యాల ఎలక్ట్రానిక్ మానుఫ్యాక్టరింగ్ క్లస్టర్‌ను సందర్శించింది. మొదట టీఎస్ ఐఐసీ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తెలంగాణలో నూతన పారిశ్రామిక వాడల అభివృద్ధి, టీ- హబ్ నిర్మాణం, ఐలాల నిర్వహణ విధివిధానాలపై అధ్యయనం చేశారు. ముఖ్యంగా టీ-హబ్ నిర్మాణంలో అనుసరించిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, తదితర అంశాలపై వారు అమితాసక్తిని ప్రదర్శించారు.

బహుళ అంతస్తుల్లో టీ హబ్ కట్టడం శైలి అద్భుతంగా ఉందని, ఇంజినీరింగ్, సాంకేతిక పరిజ్ఞానంపై టీఎస్ ఐఐసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. హర్యానా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆ సంస్థ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, వీసీ అండ్ ఎండీ నర్సింహారెడ్డి, సీఈవో మధుసూదన్ , ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీఎస్ ఐఐసీ ఆధ్వర్యంలో ఎనిమిదేళ్లలో వేగవంతంగా జరుగుతున్న పారిశ్రామికాభివృద్ధిని హర్యానా అధికారులకు వివరించారు. హర్యానా అధికారుల బృందంలో.. ఆ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థకు చెందిన ఈడీ సందీప్ చావ్లా, ఎలక్ట్రానిక్ మానుఫ్యాక్టరింగ్, లీగల్ సెల్ నోడల్ ఆఫీసర్ రాజీవ్ శర్మ, ఇంజినీరింగ్ డివిజన్ విభాగ అధిపతి అర్జున్ పాండే, రిలేషన్‌షిప్ వింగ్ మేనేజర్ హితేశ్ శర్మ, కన్సల్టెంట్ ప్రీతమ్ దేశ్‌ముఖ్ ఉన్నారు.

ఈ సందర్భంగా టీఎస్ ఐఐటీ చైర్మన్ బాలమల్లు, ఎండీ నర్సింహారెడ్డి మాట్లాడుతూ గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రాంతం పారిశ్రామికరణలో తీవ్ర వివక్షకు గురైనందున 14 ప్రాధాన్యత రంగాల్లో కొత్త పారిశ్రామికవాడలను పెద్ద ఎత్తున నిర్మిస్తున్నామని టీఎస్ ఐఐసీ తెలిపారు. పరిశ్రమల స్థాపనకు రాష్ట్రంలో 1.45 లక్షల ఎకరాల భూములను గుర్తించామని, ఈ భూములను భారీ పరిశ్రమలకు కేటాయించడమే కాకుండా, ఎంఎస్ఎంఈ యూనిట్లు నెలకొల్పేలా అన్ని జిల్లాల్లోనూ కొత్త పారిశ్రామికవాడలను వేగంగా అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు.

భారీ పెట్టుబడులు, ఉపాధి కల్పన లక్ష్యంగా మెగా ఇండస్ట్రియల్ పార్కులను అభివృద్ధి చేస్తూనే, మరోవైపు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను కల్పించే చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. ఇందులో భాగంగానే ఎనిమిదేళ్ల కాలంలో 30-40వేల ఎకరాల్లో 152 కొత్త ఇండస్ట్రియల్ పార్కులు అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేసే దిశగా టీఎస్ ఐఐసీ అమలు చేస్తున్న విధానాలు, అనుసరిస్తున్న సాంకేతిక పద్ధతులను ఈ సందర్భంగా హర్యానా అధికారులకు వివరించారు. సమావేశంలో టీఎస్ ఐఐసీ చీఫ్ ఇంజినీర్ శ్యామ్‌సుందర్, సీజీఎం సునీతా బాయి, జీఎం రేవతిబాయి, జోనల్ మేనేజర్లు, డీజీఎంలు, తదితర అధికారులు పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 13:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ నియోజకవర్గం లోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఆధ్య ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ మోహన్ గోలి అన్నారు. చంద్రుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామంలో మంగళవారం నిరుద్యోగ యువత తో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్ గోలి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఉద్యోగ అవకాశాలు లేక. ఉపాధి లేక యువత చెడు వ్యసనాలకు అలవాటు పడుతూ తిరుగుతున్నారని వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఆధ్య ఫౌండేషన్ ద్వారా కృషి చేస్తామన్నారు. చదువుకున్న ప్రతి ఒక్కరు ఉద్యోగం చేయాలని ఆశయంతో త్వరలో చేపట్టబోయే మెగా జాబ్ మేళాకి ప్రతి ఒక్కరు హాజరై వారి భవిష్యత్తుకు మార్గం వేసుకునే విధంగా ముందుకు సాగాలని అన్నారు. ఇందుకు తమ వంతు కృషి ఎల్లప్పుడూ ఉంటుందన్నారు,

# నేడు బండపల్లి లో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం...



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 13:(నేటినిజం ప్రతినిధి): చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో కరీంనగర్ ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మినరల్ వాటర్ ప్లాంట్లును బుధవారం ప్రతిమ ఫౌండేషన్ అధినేత చెన్నమనేని వికాస్ రావు ప్రారంభిస్తున్నట్లు బండపల్లి ఎంపిటిసి గడ్డం రణధీర్ రెడ్డి తెలిపారు. మంగళవారం బండపల్లి గ్రామంలో రక్షిత మంచినీటి ప్లాంట్ ను ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రతిమ ఫౌండేషన్ ప్రతినిధులు కౌశిక్ తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామంలో ప్రజలందరికీ సురక్షిత మంచినీరు అందించేందుకు ఈ ప్లాంట్ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి గడ్డం శ్రీనివాస్ రెడ్డి. మాజీ సర్పంచి కటకం మల్లేశం. నాయకులు కటకం చంద్రయ్య. నారాయణ రెడ్డి. అంబాల శ్రీకాంత్. బాబు ప్రతిమ ఫౌండేషన్ సిబ్బంది దారం రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు,

